క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పామర్రు(తోట్లవల్లూరు): తోట్లవల్లూరు మండలం దేవరపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని ఐలూరు గ్రామంలో శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈఈ డి.కృష్ణానాయిక్ గురువారం పేర్కొన్నారు. గ్రామంలో కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటుతో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని ఆయన కోరారు.

ముమ్మరంగా రోడ్డు విస్తరణ పనులు



మండవల్లి: నేషనల్ హైవే(విజయవాడ-భీమవరం) ఆర్‌అండ్‌బీ రహదారిపై రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. స్థానిక సెంటర్‌లో గురువారం పనులు నిర్వహించారు. నేషనల్ హైవే పనులు పూర్తి కావడానికి రెండేళ్లు పడుతుందని సూపర్‌వైజర్ నాగరాజు పేర్కొన్నారు.

అధ్వానంగా ఆర్‌అండ్‌బీ రహదారి



మండవల్లి: స్థానిక రైల్వే గేట్ సమీపంలో మండవల్లి నుంచి మూడుతాళ్లపాడు మీదుగా ఇంగిలిపాకలంక వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి అస్తవ్యస్తంగా మారింది. ఈ రహదారిపై ప్రయాణించడానికి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు రోడ్డు మీదకు చేరుతుంది. వర్షం కురిస్తే రహదారిపై గుంతలలో వర్షం నీరు నిలిచి చెరువులా మారుతుంది. రైల్వే గేట్ మూసిన సమయంలో వాహనదారులు తమ వాహనాలను గుంతల్లోని వర్షం నీటిలోనే నిలపాల్సి వస్తుందని వాపోతున్నారు. ఈ ప్రాంతంలోని గుంతలను పూడ్చి రహదారి అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎంపీపీ స్కూల్‌లో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్



మండవల్లి: మండలంలోని అయ్యవారి రుద్రవరం ప్రాథమిక పాఠశాలలో గురువారం ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమం నిర్వహించారు. భిన్నత్వంలో ఏకత్వమే ప్రధాన లక్ష్యంగా భారతీయ సంస్కృతిపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమం దోహదం చేస్తుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. రాజ్యాంగంలోని రాజ్యాంగ పీఠకను విద్యార్థులతో చదివించి అర్థాన్ని పిల్లలకు వివరించామని తెలిపారు. విద్యార్థులకు అన్ని రాష్ట్రాల సంస్కృతి, వేషధారణ తెలియజేయడానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయుడు సీహెచ్ పిచ్చియ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆవులను గోశాలకు తరలించండి



మండవల్లి: మండవల్లి సెంటర్‌లో విజయవాడ – భీమవరం ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన గురువారం ఆవుల మంద వీర విహారం చేసింది. రహదారిపై వాహనాలు తిరుగుతున్నప్పటికీ ఆవులు గుంపులుగా తిరిగాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు వాటిని తప్పించుకొని తిరగాల్సిన భయానక పరిస్థితి ఏర్పడింది. ఆవులను గోశాలకు తరలించాలని వాహనదారులు కోరారు.

గుర్రపుడెక్కతో నిండిన లంక కాలువ

- కాలువ కింద 25 వేల ఎకరాల్లో సాగు
- అడ్డంకులతో దిగువకు ప్రవహించని నీరు
- ఇబ్బంది పడుతున్న అన్నదాతలు



పామర్రు లంకకాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క

పామర్రు: పామర్రు గ్రామంలోని పుల్లేరు కాలువ వద్ద ఏర్పడిన లంక కాలువ అక్కడి నుంచి బల్లిపర్రు, పామర్రు మీదుగా ప్రవహిస్తూ కాలువ పరిసర ప్రాంతాలలోని వరి పొలాలకు సాగునీరు అందుతుంది. కాలువ పామర్రు, కొత్తూరు, అడ్డాడ, కొమరవోలు, గాంధీ ఆశ్రమం గ్రామాల నుంచి ప్రవహించి గుడ్లవల్లేరు మండలంలోకి ప్రవేశించి అక్కడ పుల్లేరులో కలుస్తుంది. ఈ కాలువ ద్వారా రెండు మండలాల పరిధిలో 25 వేల ఎకరాల వరి సాగు భూమికి సాగునీటిని అందిస్తోంది. కాలువలో గుర్రపుడెక్క, తూడు కాడలు విపరీతంగా పెరిగిపోవడం కారణంగా కాలువలోని నీరు దిగువ ప్రాంతాలకు సక్రమంగా ప్రవహించడం లేదు. దీనితో కాలువ పరిసర ప్రాంతాలలోని రైతులు సాగుకు నీరు అందక అనేక ఇబ్బందులు పడుతున్నారు. సాగునీరు దిగువ ప్రాంతాలకు ప్రవహించక ఆయా ప్రాంతాలలో సాగు కష్టతరంగా ఉంటోందని ఆవేదన చెందుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు వేసవిలోనే చర్యలు తీసుకుని ఉంటే ప్రస్తుతం ఈ పరిస్థితి వచ్చేది కాదని రైతులు వాపోతున్నారు. శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే కాలువలో గుర్రపుడెక్క పేరుకుపోయిందని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూడుకాడలను సత్వరమే తొలగించాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా కైకాల సత్యనారాయణ జయంతి



కేక్ కట్ చేస్తున్న కాపు సేవా సమితి నాయకులు

గుడివాడరూరల్: నటనలో అన్ని రకాలుగా ప్రజలను మెప్పించిన కైకాల సత్యనారాయణకు పద్మశ్రీ అవార్డు ఇవ్వాలని కాపు సేవా సమితి నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గుడివాడ కాపు సేవా సమితి ఆధ్వర్యంలో దివంగత కైకాల సత్యనారాయణ జయంతి వేడుకలను పాత మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించారు. కైకాల కాంస్య విగ్రహానికి కాపు సంఘ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాపు నాయకులు మాట్లాడుతూ సినీ రంగంలో మకుటం లేని మహారాజుగా అనేక పాత్రలు ధరించి కైకాల నవరసనటన సార్వభౌముడిగా కీర్తి పొందాడన్నారు. అటువంటి వ్యక్తి మన ప్రాంతానికి చెందిన వాడు కావడం మనందరి అదృష్టమన్నారు.

కళాకారులకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి..

నటనలో ప్రపంచ వ్యాప్తంగా కీర్తి పొందిన కైకాలకు పద్మశ్రీ అవార్డు ఇచ్చి కేంద్ర ప్రభుత్వం గౌరవించాలని కాపు నాయకులు కోరారు. గుడివాడలో కైకాల స్మారక చిహ్నంగా ఏర్పాటు చేసిన కైకాల కళా మందిరాన్ని అభివృద్ధి చేసి కైకాల సేవలను ప్రజలందరికి చేరువయ్యేలా ప్రభుత్వం చూడాలని సూచించారు. కైకాల పేరుపై పలు సేవా కార్యక్రమాలు, కళాకారులకు ప్రోత్సాహకాలు ప్రభుత్వం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కాపు సేవాసమితి అధ్యక్షుడు నరహరిశెట్టి ప్రసాద్, వ్యవస్థాపకుడు పాన్నూరు రామకృష్ణ, కాపు సంఘ పెద్దలు పాలేటి చంటి, గోకరకొండ బలరామ్, బోయిన చంటి, అడబాల అప్పారావు, చెన్నకేశవరావు, పంచకర్ల వెంకట్, వంగా వంశీ, కళాసంఘం పెద్దలు నెరుసు చింతయ్య, కొడాలి రాజా, అల్లాడి శ్రీనివాస్, ఆర్‌కె, అడ్డేపల్లి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మగ్గం శిక్షణ తరగతులు



కైకలూరు: స్థానిక సత్యసాయి మందిరంలో 37 రోజులుగా జరుగుతున్న మగ్గం, జర్దోసి ఉచిత శిక్షణా తరగతులు గురువారంతో ముగిశాయి. గత నెల 13 నుంచి ఈ నెల 24వ తేదీ వరకు నిర్వహించిన శిక్షణలో 70 మంది మహిళలు శిక్షణ తీసుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన బ్యాంకర్లు గ్రామీణ ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ నిర్వహణలో శిక్షణ ఇచ్చారు. చివరి రోజు ఏలూరు జిల్లా సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు శేషశేఖరరావు ముఖ్య అతిథిగా విచ్చేసి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ జ్యోతిరాణి, న్యాయవాది పద్మావతి, సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలి



గురజాడలో పొలాలను పరిశీలిస్తున్న అధికారులు శ్రీనివాస్, సుధారాణి

పమిడిముక్కల: భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగించాలని వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ఏడీఏ శ్రీనివాస్ తెలిపారు. గురజాడ రైతు సేవా కేంద్రంలో ఆత్మ ఆధ్వర్యంలో గురువారం రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ శ్రీనివాస్ మాట్లాడుతూ.. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు పద్ధతులు మార్చుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని సూచించారు. కలుపు మందుల యాజమాన్యాల గురించి వివరించారు. నారుమళ్ల యాజమాన్యం గురించి వ్యవసాయ పరిశోధనా స్థానం ఉయ్యూరు కీటక శాస్త్ర విభాగం సీనియర్ శాస్త్రవేత్త సుధారాణి తెలిపారు. రైతులతో కలిసి నాట్లు వేసిన పొలాలను పరిశీలించారు. మండల వ్యవసాయాధికారి గణేష్‌రెడ్డి ఎరువుల యాజమాన్యం వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఆత్మ వ్యవసాయాధికారి పద్మజ, రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

గుడివాడ సుందరీకరణకు చర్యలు



మున్సిపల్ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యంతో చర్చిస్తున్న బృందం సభ్యులు

గుడివాడరూరల్: గుడివాడ పట్టణాన్ని సుందరీకరణ చేసే పనుల్లో భాగంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కృషితో పట్టణంలో విజయవాడకు చెందిన డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ నిపుణుల బృందం గురువారం పర్యటించింది. గుడివాడలోని ఆర్టీసీ బస్టాండ్, రామబ్రహ్మం పార్క్, గుడివాడ పురపాలక సంఘ కార్యాలయ సెంటర్, నాగవరప్పాడు నుంచి బస్టాండ్ వరకు ఉన్న డివైడర్, పురపాలక సంఘ భవనాలను ఆర్కిటెక్చర్ నిపుణుల బృందం పరిశీలించింది. మున్సిపల్ కార్యాలయంలో పట్టణ సుందరీకరణకు తీసుకోవాల్సిన చర్యలపై మున్సిపల్ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యంతో చర్చించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కృషితో గుడివాడలో పలు ప్రాంతాలను ఆర్కిటెక్చర్ బృందం పర్యటించి సుందరీకరణతో పాటు అభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలపై తగు సూచనలు చేసిందన్నారు. బృందం ఇచ్చిన నివేదిక ప్రకారం ఎమ్మెల్యేతో చర్చించి గుడివాడను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే విధంగా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

శాకంబరీ అలంకరణలో గంగానమ్మ అమ్మవారు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

గుడివాడరూరల్: పట్టణంలోని మేదర్ బజార్‌లోని గంగానమ్మ వీధిలోని శ్రీగంగానమ్మ దేవస్థానంలో గురువారం శాకంబరీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కాయగూరలు, ఆకుకూరలు, వివిధ రకాల పండ్లతో శాకంబరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారికి వేద పండితులు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకల్లో ఉత్సవ పీఠలపై భక్తులు కూర్చుని అమ్మవారికి విశేష పూజలు చేశారు. ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రతి ఏటా దేవస్థానంలో శాకంబరీ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని భక్తులు తెలిపారు. కార్యక్రమంలో వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

చురుగ్గా వరి నాట్లు



మండలంలో వరి నాట్లు వేస్తున్న కూలీలు

పామర్రు: మండల పరిధిలో వాతావరణం అనుకూలంగా ఉండటంతో వరి నాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. మండలంలో 23,500 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. ఇప్పటి వరకు 10 వేల ఎకరాల్లో వరి నాట్లు పూర్తి అయినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. చాలా గ్రామాల్లో ఎదజల్లే పద్ధతిలో వరి సాగుకు శ్రీకారం చుట్టారు. మరి కొన్ని గ్రామాల్లో వరి నారుమళ్ల పోసుకుని నాట్లు వేస్తున్నారు. మిగిలిన 13,500 ఎకరాల్లోనూ నాట్లు త్వరితగతిన పూర్తి చేసేందుకు రైతులు పనులు నిర్వహిస్తున్నారు.

భక్తాంజనేయుడికి విశేష పూజలు



భక్తాంజనేయుడికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: కైకలూరు రోడ్డులోని భక్తాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి జన్మ నక్షత్రమైన పూర్వాబాద్ర నక్షత్రం సందర్భంగా పూజలు చేశారు. సువర్చలా సమేత ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాలను, మూల విగ్రహాన్ని అందంగా అలంకరించి విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ముదినేపల్లి ఆర్యవైశ్య సంఘం నిర్వాహకుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మాడుగుల పూర్ణచంద్రరావు, సభ్యులు కురిచేటి వాసు, వత్తిమిల్లి ప్రసాద్ పర్యవేక్షించారు.

షిర్డిసాయికి ప్రత్యేక పూజలు

పామర్రు: స్థానిక సాయినగర్‌లో వేం చేసి ఉన్న శ్రీ షిర్డిసాయి బాబా మందిరంలో ఆషాఢమాసం గురువారం పురస్కరించుకుని పలు ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత కాకడ హారతితో బాబావారికి సేవలను ప్రారంభించారు. పంచామృతాలు, నవరసాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలను చేశారు. పలు రకాల పుష్పమాలలతో బాబాను ప్రత్యేకంగా పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని బాబాను పూజించారు. అనంతరం మధ్యాహ్న హారతి నిర్వహించారు. భక్తులందరికీ అన్న సమారాధన నిర్వహించారు. అర్చకుడు శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించగా, ఆలయ కమిటీ చైర్మన్ తమ్మా వినోద్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



సాయిబాబాకు హారతి ఇస్తున్న భక్తులు

ప్రణాళికాబద్ధంగా విద్యనభ్యసించాలి




చక్రవర్తికి జ్ఞాపికను అందిస్తున్న కాలేజీ యాజమాన్యం

గుడ్లవల్లేరు: విద్యార్థులు ఒక లక్ష్యాన్ని తమ మెదడులో ఏర్పరచుకుని ప్రణాళికాబద్ధంగా జీవితంలో కొనసాగితే విజయం తథ్యమని ప్రముఖ మోటివేటర్, సైకాలజిస్ట్ డాక్టర్ విడియాల చక్రవర్తి అన్నారు. శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీలోని విద్యార్థులు గురువారం వ్యక్తిత్వ వికాస తరగతులను నిర్వహించారు. క్రమశిక్షణ, కష్టపడే తత్వం, నిబద్ధత, నిజాయితీ వంటి గుణాలను కలిగి తమ లక్ష్యాన్ని సాధించాలన్నారు. అనంతరం ఆయనకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కరుణకుమార్ జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కోదండ రామారావు, కో ఆర్డినేటర్లు డాక్టర్ ఎల్.ఆర్.శ్రీనివాస్, డాక్టర్ ఎస్.సురేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మెగా వైద్య శిబిరం

మండవల్లి: మండవల్లిలో కొలువై ఉన్న శ్రీ నాగ సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ఏలూరు శంకర్ నేత్రాలయ వారిచే కంప్యూటర్‌పై కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ మెండా ఝాన్సీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్ చేస్తారన్నారు. శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యశిబిరం కొనసాగుతుందని చెప్పారు. వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కోరారు.

గుడ్లవల్లేరులో టార్చ్ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, అధ్యాపకులు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు ఏఏఎన్‌ఎం అండ్ వీవీఆర్‌ఎస్‌ఆర్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో గురువారం టార్చ్ ర్యాలీని నిర్వహించారు. శుక్రవారం ప్యారీస్‌లో జరగబోయే ఒలింపిక్ క్రీడల్లో భారతదేశ క్రీడాకారులు అత్యధిక మెడల్స్‌ను సాధించాలని ఆకాంక్షిస్తూ ఈ ర్యాలీని చేపట్టామని శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కరుణకుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కోదండ రామారావు, ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణ రావు, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎస్.రాజశేఖర్, పీడీ మత్తి శివశంకర్, అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న డయేరియా సర్వే



డయేరియాపై అవగాహన కల్పిస్తున్న ఆశ వర్కర్

మండవల్లి: పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండవల్లిలో డయేరియాపై గురువారం ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా గృహాల్లో డయేరియా ప్రభావంపై అవగాహన కల్పించారు. చేపట్టాల్సిన చర్యలు, జాగ్రత్తలను వివరించారు.

డయేరియాపై అవగాహన సదస్సు

ముదినేపల్లి రూరల్: డయేరియాపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఝాన్సీ అన్నారు. మండలంలోని పెయ్యేరు కాలనీలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వచ్ఛమైన తాగునీటితో డయేరియాకు దూరంగా ఉండొచ్చన్నారు. పరిసరాల పరిశుభ్రతతో డయేరియాను నివారించుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా బహూకరణ



పామర్రు(తోట్లవల్లూరు): తోట్లవల్లూరు మండలం యాకమూరు గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు దాత సీహెచ్.టి.వెంకటేశ్వరరావు రూ.10 వేలతో ఇనుప బీరువాను గురువారం బహూకరించారు. దాత మాట్లాడుతూ ఇచ్చిన సహకారాన్ని విద్యార్థులు ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఉన్నతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు చొప్పరపు నాగ సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా బీరువాను పాఠశాల ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు, స్థానికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అసభ్య ప్రవర్తనపై కేసు నమోదు

కైకలూరు: వివాహిత మహిళతో అసభ్యకరంగా మాట్లాడిన వ్యక్తిపై కైకలూరు రూరల్ పోలీసు స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కైకలూరు మండలం ఆలపాడు శివారు సోమేశ్వరం కాలనీలో ఒక మహిళ తన కుమార్తెతో కలిసి నివసిస్తోంది. కోలా ప్రసన్నకుమార్(27) మద్యం మత్తులో కుమార్తెపై అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీనిపై ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిగత మరుగుదొడ్లు తప్పనిసరి

కైకలూరు: మండలంలో ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లు కలిగి ఉండాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఈ నెల 25 నుంచి 31 వరకు వ్యక్తిగత మరుగుదొడ్లు లేని వారి వివరాలపై ఇంటింటా సర్వే చేయాలని తెలిపారు. ఇందుకోసం ఇప్పటికే కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో పలు గ్రామాల సెక్రటరీలు పాల్గొన్నారు.